ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అన్నింటా ఆధిక్యమే

- జిల్లాలో కూటమికి భారీ మెజార్టీ
- వైసీపీకి గట్టి షాక్ ఇచ్చిన టీడీపీ అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీయే కూటమి సునామీ మాదిరి విజృంభించి వైసీపీని తుడిచిపెట్టేసింది. జిల్లాలో శ్రీకాకుళం లోక్‌సభతో పాటు.. ఎనిమిది అసెంబ్లీ స్థానాలను భారీ మెజార్టీతో కూటమి కైవసం చేసుకుంది. టీడీపీ అభ్యర్థులకు రౌండ్ రౌండ్‌కూ ఆధిక్యత రావడం.. ఎన్నడూ లేనంత మెజార్టీ లభించడంతో వైసీపీ నాయకులు ఖంగుతిన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలతోపాటు, ఉద్యోగుల స్వేచ్ఛను సైతం హరించేసింది. ఏం మాటాడినా, అన్యాయం జరిగిందని గొంతెత్తినా, హక్కుల సాధన కోసం పోరాటం చేసినా అప్రజాస్వామిక దాడులు చేసేవారు. పోలీసు కేసులు, అరెస్టుకు దిగేవారు. మరోవైపు టీడీపీ నేతలే లక్ష్యంగా అక్రమ అరెస్టులు, కక్షసాధింపులకు పాల్పడేవారు. ఇలా అన్ని విధాలా అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారు. మరోవైపు ఐదేళ్లలో ఎక్కడా అభివృద్ధి పనులు లేక అసంతృప్తి చెందారు. అందుకే ఓట్ల రూపంలో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతను బయటపెట్టారు. ఊహించని స్థాయిలో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. ఈసీ ఆదేశాలతో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడం.. కూటమి అధికారంలోకి రావడంతో అన్నివర్గాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

కూటమి మెజార్టీ ఇలా..

- వైసీపీ సీనియర్ నేత.. మంత్రి ధర్మాన ప్రసాదరావుపై.. సర్పంచ్‌గా ఉంటూ టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన గొండు శంకర్ జిల్లాలోనే అత్యధికంగా 52,521 ఓట్ల తేడాతో గెలవడం చర్చనీయాంశమవుతోంది. ధర్మాన మొదటి రెండున్నరేళ్లు.. ప్రజలను పట్టించుకోకపోవడం.. మంత్రిగా అవకాశం దక్కాక.. చంద్రబాబును విమర్శించడమే పనిగా పెట్టుకుని ప్రజలనుంచి ఛీత్కారానికి గురయ్యారు. కనీసస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగింది.
- తర్వాత స్థానంలో పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజుపై గౌతు శిరీషకు 40,350 ఓట్లు ఆధిక్యత లభించింది. పశుసంవర్థకశాఖ మంత్రి ఉంటూ.. కొండలను గుల్ల చేసిన సీదిరికి పరాభవమే ఎదురైంది.
- ఇక ఆమదాలవలసలో వైసీపీ అభ్యర్థి స్పీకర్ తమ్మినేని సీతారామ్‌పై టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్‌కు 35,032 ఓట్ల మెజార్టీ దక్కింది.
- టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై టీడీపీ అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడుకు 34,435 ఓట్ల మెజార్టీ వచ్చింది. అచ్చెన్నకు హ్యాట్రిక్ విజయం దక్కింది.
- ఇచ్ఛాపురంలో బెందాళం అశోక్‌కు 39,783 ఓట్లు, నరసన్నపేటలో బగ్గు రమణమూర్తికి 29,371 ఓట్లు, పాతపట్నంలో మామిడి గోవిందరావుకు 26,527 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇక ఎచ్చెర్ల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు 29,089 ఓట్ల మెజార్టీతో జిల్లాలో ఆపార్టీ తరపున అసెంబ్లీకి బోణీ కొట్టడం చర్చనీయాంశమైంది.
- శ్రీకాకుళం లోక్‌సభ స్థానానికి గాను టీడీపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ప్రజలు ఏకపక్షంగా ఓట్లేశారు. రామ్మోహన్‌నాయుడుకు 7,54,328 ఓట్లు పోలయ్యాయి. వైసీపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు 4,26,427 ఓట్లు మాత్రమే పడ్డాయి. 3,27,901 ఓట్ల మెజార్టీతో రామ్మోహన్‌నాయుడు హ్యాట్రిక్ విజయం సాధించడంతో.. ఈసారి ఆయనకు కేంద్రమంత్రి వర్గంలో పదవి లభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

నోటా దాటని కాంగ్రెస్

- హస్తానికి పెరగని ఓటు బ్యాంక్

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు, నోటాకు లభించిన ఓట్లు..

నియోజకవర్గం	కాంగ్రెస్ అభ్యర్థి పేరు	ఓట్లు	నోటా
ఆమదాలవలస	సనపల అన్నాజీరావు	3,481	2,300
ఎచ్చెర్ల	కరిమజ్జి మల్లేశ్వరరావు	2,452	3,952
ఇచ్ఛాపురం	మాసుపత్రి చక్రవర్తిరెడ్డి	792	4,374
పాతపట్నం	కొప్పురౌతు వెంకటరావు	3,565	3,604
పలాస	త్రినాథ్‌బాబు మజ్జి	1,064	2,762
నరసన్నపేట	మంత్రి నరసింహమూర్తి	2,225	3,300
శ్రీకాకుళం	అంబటి కృష్ణారావు	4,353	3,373
టెక్కలి	కిల్లి కృపారాణి	2,684	7,342
మొత్తం		20,616	31,007
శ్రీకాకుళం లోక్‌సభ	పేడాడ పరమేశ్వరరావు	7,172	24,605

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

రాష్ట్ర విభజన కారణంగా తెలుగు ప్రజలు 2014లో కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు. ప్రత్యేకంగా విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014లోనూ, 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ డీలాపడింది. ఈసారి ఎన్నికలకు మాత్రం కాంగ్రెస్‌కు కాస్త జవసత్వాలు వచ్చాయని అందరూ భావించారు. పీసీసీ అధ్యక్షురాలి బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిలారెడ్డి.. ముందుగా శ్రీకాకుళం జిల్లాలోనే ప్రచారం నిర్వహించారు. తన అన్న వైఎస్ జగన్‌పై మాటల తూటాలు పేల్చారు. జనం నుంచి కూడా స్పందన లభించింది. కానీ ఎన్నికల్లో మాత్రం ఓట్ల రూపంలో ఆ స్పందన కనిపించలేదు. నోటా కన్నా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరికీ తక్కువగానే ఓట్లు పోలయ్యాయి.

● గత ఎన్నికలు పరిశీలిస్తే..

శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీకి 2014లో 24,171 ఓట్లు, 2019లో 13,745 ఓట్లు లభించాయి. ఈసారి (2024) ఎన్నికల్లో 7,172 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అలాగే జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో 2014లో కాంగ్రెస్ పార్టీకి మొత్తం 24,707 ఓట్లు లభించాయి. 2019లో 17,059 ఓట్లు పోలయ్యాయి. ఈసారి ఎన్నికల్లో 20,616 ఓట్లు లభించాయి. కాగా.. ఈసారి ఎన్నికల్లో అసెంబ్లీ స్థానాల్లో కానీ, లోక్‌సభ స్థానంలో కానీ నోటా కన్నా కాంగ్రెస్ పార్టీకి తక్కువ ఓట్లు పోలయ్యాయి. నోటాకు 8 అసెంబ్లీ స్థానాల్లో 31,007 ఓట్లు, శ్రీకాకుళం లోక్‌సభకు 24,605 ఓట్లు లభించాయి. ఈ ఫలితాలను బట్టి ఇప్పటికీ హస్తానికి జనాల్లో ఆదరణ పెరగలేదని స్పష్టమవుతోంది.



నరసన్నపేటలో విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న ఏవో సునీత(ఫైల్)

విత్తనాల పంపిణీ ఎప్పుడో?

- రైతుభరోసా కేంద్రాల్లో కానరాని ప్రక్రియ
- జేబులు నింపుకొంటున్న వ్యాపారులు
- ఆందోళనలో రైతులు

(నరసన్నపేట)

విత్తనాల కోసం డిమాండ్ అధికంగా ఉన్నా.. ఆ స్థాయిలో సరఫరా లేకపోవడంతో అన్నదాతలు కలవరపడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే విత్తనాల రూపంలో తమకు కష్టాలు మొదలయ్యాయని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన విత్తనాలు ఇప్పటికీ రైతుభరోసా కేంద్రాలకు చేరలేదు. దీంతో విత్తనాలు ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియక రైతులు అయోమయం చెందుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 4.37లక్షల ఎకరాల్లో వరిసాగు చేయనున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇందుకోసం 40వేల క్వింటాళ్ల విత్తనాల పంపిణీకి సంబంధించి ప్రతిపాదనలు పెట్టారు. జిల్లాలో 656 రైతుభరోసా కేంద్రాల విత్తనాల పంపిణీకి ప్రణాళిక రూపొందించారు. ఎంటీయూ 7029 (స్వర్ణ) 3వేల క్వింటాళ్లు, ఎంటీయూ-1061 7వేల క్వింటాళ్లు, 1064 రకాలు 2500 క్వింటాళ్లు, బీపీటీ 5204 (సాంబమసూరి) 5వేల క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ -2వేల క్వింటాళ్లు, 1224 మార్టూరు సాంబ- 1500 క్వింటాళ్లు, శ్రీధూతి - 5వేల క్వింటాళ్ల విత్తనాలను కిలోకు రూ.10 సబ్సిడీపై పంపిణీ చేయనున్నారు. కాగా.. విత్తనాల కొరత కారణంగా ఇంతవరకూ రైతుభరోసా కేంద్రాలకు విత్తనాలు చేరుకోలేదు. పైగా డిమాండ్ ఉన్న విత్తనాలు కాకుండా సాధారణ రకాలను ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేయనుండడంతో రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. స్వర్ణ, 1061, 1064, బీపీటీ 5204, 1224, శ్రీధూతి వంటి రకాలు కాకుండా.. అమూల్య, సందసర్ణ, 333 రకాల కోసం ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు విత్తనాల కోసం అప్పు చేసి డీలర్లకు అడ్వాన్స్‌లు కూడా చెల్లిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు డీలర్లు.. విత్తనాల ధరలను పెంచేసి రైతులను దోచుకుంటున్నారు. తెలంగాణ, నూజివీడు తదితర ప్రాంతాల నుండి తెప్పించిన రీచెర్స్ వెరైటీలు 333, అమూల్య, సంపద స్వర్ణ తదితర రకాలను 20 కేజీల బస్తాను రూ.1200 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. అమూల్య రకం విత్తనాలను కృత్రిమకొరత సృష్టించి కొందరు డీలర్లు అధిక ధరకు విక్రయాలు చేపడుతున్నారు.

నకిలీలతో నష్టం

మరికొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలతో రైతులను దోపిడీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. బ్రాండెడ్ ఖాళీ సంచుల్లో నాశిరకం ధాన్యాన్ని నింపి.. వాటిని ధ్రువీకరణ విత్తనాలుగా మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు సమాచారం. రెండేళ్ల కిందట ఇదే మాదిరి నరసన్నపేట కేంద్రంగా నకిలీ విత్తనాల అమ్మకాలు జోరుగా సాగాయి. అప్పట్లో దీనివల్ల నష్టపోయిన రైతులు ఆందోళన చేశారు. ఈ ఏడాదైనా నాణ్యమైన విత్తనాలను అందుబాటు ధరకే అందజేయాలని కోరుతున్నారు. ఈ మేరకు అధికారులు విత్తనాలు విక్రయించే ట్రేడర్స్‌ను ఆకస్మిక తనిఖీ చేస్తున్నారు. గురువారం నరసన్నపేట ఏవో సునీత పలు ట్రేడర్స్‌లో విత్తనాలను నాణ్యతను పరిశీలించారు. అధీకృత కంపెనీల విత్తనాలు మాత్రమే విక్రయించాలని డీలర్లకు స్పష్టం చేశారు. రైతులకు బిల్లులు ఇవ్వాలని సూచించారు. విత్తనాలు మొలకెత్త నట్టు ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

సమస్యలు చెప్పేందుకు.. 80 కి.మీ. వెళ్లాల్సిందే!

- పునర్విభజనలో జిల్లా నుంచి పోయిన ఐటీడీఏ
- కొత్తగా ఏర్పాటు చేస్తామని చెప్పిన వైసీపీ సర్కారు
- అతీగతిలేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

పరిపాలనా సౌలభ్యం కోసమే జిల్లాల పునర్విభజన చేశామని వైసీపీ సర్కారు గొప్పలు చెప్పింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రగల్భాలు పలికింది. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పునర్విభజనలో భాగంగా జిల్లాలోని ఐటీడీఏ పక్క జిల్లాకు తరలిపోయింది. ఇక్కడ కొత్త ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని వైసీపీ నేతలు హామీ ఇచ్చారు. రెండేళ్లవుతున్నా అతీగతి లేదు. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలను విన్నవించేందుకు 80 కిలోమీటర్ల దూరంలోని పక్క జిల్లాకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. కొత్తగా కొలువుదీరనున్న కూటమి ప్రభుత్వం తమ సమస్యకు మోక్షం చూపాలని కోరుతున్నారు.

(మెళియాపుట్టి)

జిల్లాకు ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ నియోజకవర్గం పార్వతీపురం మన్యంజిల్లాలో కలిసిపోయింది. ఈ నియోజకర్గంలోని సీతంపేట ఐటీడీఏ కూడా ఆ జిల్లాకే వెళ్లిపోయింది. ఫలితంగా ఏ సమస్య వచ్చినా జిల్లా గిరిజనులు సీతంపేటకే వెళ్లాల్సి వస్తోంది. కొత్త ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గత రెండేళ్ల నుంచి గిరిజనులు ఆందోళనలు చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రెడ్డిశాంతి, మందసలో పెట్టాలని మంత్రి సీదిరి అప్పలరాజు ప్రభుత్వం వద్ద పంచాయితీ నడిపినట్లు ప్రచారం జరిగింది. కానీ, చివరకు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని గిరిజనులు మండిపడుతున్నారు.

ఇటు వైపు రాని అధికారులు

జిల్లాలో మెళియాపుట్టి, మందస, కొత్తూరు, పాతపట్నం మండలాల్లో గిరిజనులు అధికంగా ఉన్నారు. 16 గిరిజన ఉప ప్రణాళిక మండలాలు ఉన్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 848 గిరిజన గ్రామాలు ఉండగా.. మన్యం జిల్లాకు 378, శ్రీకాకుళం జిల్లాకు 470 గ్రామాలు కేటాయించారు. విభజన జరిగిన నాటి నుంచి ఐటీడీఏ అధికారులు జిల్లాలోని సబ్‌ప్లాన్ మండలాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని ఫిర్యాదులందుతున్నా తనిఖీలకు రావడం లేదు. ఐటీడీఏ నిధులతో గిరిజన గ్రామాల్లో రహదారుల పనులు పూర్తికాకుండానే వైసీపీ కి చెందిన కాంట్రాక్టర్లు బిల్లులు చేయించుకుంటున్నారనే ఆరోపణ లున్నాయి. గత పీవో కల్పనాకుమారి రెండుసార్లు మాత్రమే పనులను పరిశీలించారని గిరిజనులు చెబుతున్నారు.

హామీ ఏమైంది..

వైసీపీ నేతలు రెండేళ్ల నుంచి అదిగో.. ఇదిగో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామంటూ గిరిజనులను మోసం చేస్తున్నారు. జిల్లాకు కొత్త ఐటీడీఏ వచ్చాకే గిరిజనులకు ఓట్లు అడుగుతానని పలు సందర్భాల్లో ఎమ్మెల్యే రెడ్డిశాంతి హామీ ఇచ్చినా అది నెరవేరలేదు. కంటితుడుపు చర్యగా ఒకసారి అసెంబ్లీలో ఈ విషయాన్ని లేవనెత్తారు. ఐటీడీఏను కేటాయించటానికి ప్రతిపాదనలున్నాయని చెప్పి ఆ తరువాత మరిచిపోయారు. అందుకే ఈ ఎన్నికల్లో ఆమెకు గిరిజనులు బుద్ధి చెప్పారు.

మూడు బస్సులు మారితేనే..

గిరిజనులు తమ సమస్యలను ఐటీడీఏ అధికారులకు చెప్పుకోవాలంటే 80 కిలోమీటర్ల దూరంలోని సీతంపేటకు వెళ్లాల్సిందే. మూడు బస్సులు మారితే కానీ అక్కడకు చేరుకోలేరు. బస్సు చార్జీలు చెల్లించేందుకు కూడా కొందరి గిరిజనుల వద్ద డబ్బులు లేని పరిస్థితి. దీంతో వారు తమ సమస్యలను చెప్పుకోవడానికి సీతంపేటకు వెళ్లలేకపోతున్నారు. అధికంగా మందస, మెళియాపుట్టి, నందిగాం, సారవకోట, పాతపట్నం, ఎల్ఎన్‌పేట మండలాల్లో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాలకు తాగునీరు, రహదారుల సౌకర్యం లేదు. వైసీపీ ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి వివిధ కార్పొరేషన్లకు కేటాయించడంతో గిరిజన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కొండపైన ఉన్న గ్రామాలకు రహదారుల పేరుతో రూ.కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నా నేటికీ అవి పూర్తికాలేదు. అధికంగా వైసీపీ కాంట్రాక్టర్లు ఈ పనులు చేస్తుండడంతో అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో.. కొత్త ప్రభుత్వమైనా జిల్లాలో ఐటీడీఏను ఏర్పాటు చేసి తమ సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.



ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజనుల ఆందోళన(ఫైల్)



ఇబ్బందులు పడుతున్నాం

మెళియాపుట్టి, మందస మండలాల నుంచి గిరిజనులు సీతంపేట వెళ్లాలంటే 80 నుంచి 90 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. డైరెక్టు బస్సులు లేకపోవడంతో మూడు బస్సులు మారి సీతంపేటకు చేరుకోవాలి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని అమరావతిలో కలిసి ఐటీడీఏ ఏర్పాటు చేయాలని విన్నవించాం. కానీ, కేటాయించ లేదు.

- చల్లా శాంతారావు, గిరిజన సంఘం నాయకుడు



ఆశ పడ్డాం

మెళియాపుట్టి మండలానికి ఐటీడీఏ వస్తుందని ఆశ పడ్డాం. కానీ రెండేళ్లుగా నిరాశే మిగిలింది. దీంతో మా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సీతంపేట వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం, అధికారులు స్పందించి మెళియాపుట్టిలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలి.

- సవర రమేష్, కేరాశింగి, మెళియాపుట్టి



చార్జీలు భరించలేకపోతున్నాం

గిరిజన గ్రామాల్లో రైతులకు సాగు నీరు అందడం లేదు. దీనిపై ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్నా చేయలేకపోతున్నాం. మెళియాపుట్టి నుంచి సీతంపేటకు వెళ్లి వచ్చేందుకు రూ.250 బస్సు చార్జీ అవుతుంది. దీంతో చార్జీలు భరించలేక అంత దూరం వెళ్లలేకపోతున్నాం.

- బింజయ్య, గడిమెట్ట జగన్నాథపురం

వడదెబ్బతో ఉపాధి కూలి మృతి



ఎర్రయ్య(ఫైల్)

వజ్రపుకొత్తూరు, జూన్ 7: కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటకి చెందిన ఉపాధి కూలీ ఎర్రయ్య(59) వడదెబ్బకు గురై మృతి చెందారు. శుక్రవారం ఉపాధి పనికి వెళ్లిన ఎర్రయ్య ఎంతసేపయినా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మిగిలిన ఉపాధి కూలీలు సాయంత్రం ఉపాధి పని జరుగుతున్న అమ్మోరు చెరువు వద్ద వెతికారు. ఈ క్రమంలో చెరువు గట్టుపై ఎర్రయ్య విగత జీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న స్థానిక వైద్యులు వచ్చి పరిశీలించగా అప్పటికే ఎర్రయ్య మృతి చెందినట్టు నిర్ధారించారు. వెంటనే ఉపాధి అధికారులు సమాచారం అందించారు. కాగా ఎర్రయ్య భార్య పోలమ్మ కరోనా సమయంలో మృతి చెందగా.. కుమార్తె అరుణ ఉంది.

వంశధార కాలువల ఆధునికీకరణ తప్పనిసరి

- ఎస్ఈ డోల తిరుమలరావు

హిరమండలం, జూన్ 7: 'ఆయకట్టుకు నీరు అందించాలంటే వంశధార కుడి, ఎడమ కాలువలను తప్పనిసరిగా ఆధునికీకరణ చేయాలి. ఇందుకోసం ప్రభుత్వానికి రూ.900కోట్లతో ప్రతిపాదనలు పంపించామ'ని ఎస్ఈ డోల తిరుమలరావు పేర్కొన్నారు. శుక్రవారం హిరమండలంలోని గొట్టాబ్యారేజీతోపాటు దానికి అనుసంధానంగా ఉన్న కుడి, ఎడమ కాలువల గేట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం కాలువల ఆధునికీకరణపై దృష్టి సారిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎడమ కాల్వ ద్వారా 1.48లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కాలువల నిర్వహణకు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రధానంగా ఎడమ కాలువ శిథిలావస్థకు చేరుకుంది. 15ఏళ్లుగా షట్టర్ల మరమ్మతులు చేపట్టలేదు. ఎక్కడికక్కడ కాలువ గట్లు దెబ్బతిన్నాయి. పూడికలు తొలగించకపోవడంతో నీటిప్రవాహ సామర్థ్యం తగ్గింది. ఈసారి ఎన్డీయే కూటమి ప్రభుత్వం రావడంతో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది' అని తిరుమలరావు తెలిపారు. ఈ ఏడాది శివారు భూములకూ సాగునీరందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వర్షాకాలంలో వరద నీటి ప్రభావానికి ఇబ్బందులు లేకుండా బ్యారేజి వద్ద ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ ప్రదీప్‌కుమార్, డీఈఈలు హరిప్రసాద్, సురేష్‌బాబు, ధనుంజయ, సత్యనారాయణ పాల్గొన్నారు.



బ్యారేజీని పరిశీలిస్తున్న వంశధార ఎస్ఈ తిరుమలరావు

సముద్రంలో తెప్ప బోల్తా

- మత్స్యకారుడి మృతి



మూగి ఎర్రయ్య(ఫైల్)

ఎచ్చెర్ల, జూన్ 7: సముద్రంలో చేపలవేటకు వెళ్లి.. తెప్పబోల్తా పడిన ఘటనలో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. పోలీసులు.. స్థానికుల వివరాల మేరకు.. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మూగి ఎర్రయ్య(59) శుక్రవారం చేపల వేటకు వెళ్లి తెప్ప బోల్తా పడడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఎర్రయ్యతోపాటు ఇదే గ్రామానికి చెందిన గుంటు కొండయ్య, మూగి రాజ ప్పడు శుక్రవారం వేకువజామున సముద్రంలో తెప్పపై చేపల వేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి ఒడ్డుకు చేరే క్రమంలో అలల తాకిడికి తెప్ప బోల్తా పడింది. ముగ్గురూ సముద్రపు నీటిలో పడగా.. కొండయ్య, రాజ ప్పడు వెంటనే తేరుకుని తెప్పను అందుకున్నారు. ఎర్రయ్య మాత్రం గాయపడి నీటిని అధికంగా తాగేసి.. ఒడ్డుకు చేరేసరికి మృతిచెందాడు. మృతుడి భార్య కాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

దిక్సూచి DIKSUCHI


సిడాక్‌లో పీజీ డిప్లొమాలు

పుణెలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సిడాక్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా(పీజీ డిప్లొమా) ఆగస్టు సెషన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి 24 వారాల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్‌లు. సంస్థ నిర్దేశించిన మేరకు కోర్సులను ఆన్‌లైన్/ఫిజికల్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ సెషన్స్, ల్యాబ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటిని సి-డాక్, ఐసీటీ సంస్థలకు చెందిన నిపుణులు నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఉంటుంది. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది. హైదరాబాద్ సెంటర్లో మహిళలకు మాత్రమే హాస్టల్ అందుబాటులో ఉంది.

కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (పీజీ-డీఏసీ)
- పీజీ డిప్లొమా ఇన్ బిగ్ డేటా అనలిటిక్స్(పీజీ-డీబీడీఏ)
- పీజీ డిప్లొమా ఇన్ ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ (పీజీ-డీఈఎస్‌డీ)
- పీజీ డిప్లొమా ఇన్ ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ(పీజీ-డీఐటీఐఎస్ఎస్)
- పీజీ డిప్లొమా ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (పీజీ-డీఏఐ)
- పీజీ డిప్లొమా ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(పీజీ-డీఐఓటీ)
- పీజీ డిప్లొమా ఇన్ వీఎల్ఎస్ఐ డిజైన్(పీజీ-డీవీఎల్ఎస్ఐ)
- పీజీ డిప్లొమా ఇన్ మొబైల్ కంప్యూటింగ్(పీజీ-డీఎంసీ)
- పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్(పీజీ-డీఏఎస్ఎస్‌డీ)
- పీజీ డిప్లొమా ఇన్ రోబోటిక్స్ అండ్ అలైడ్ టెక్నాలజీస్(పీజీ-డీఆర్ఏటీ)
- పీజీ డిప్లొమా ఇన్ హెచ్‌పీసీ సిస్టం అడ్మినిస్ట్రేషన్(పీజీ-డీహెచ్‌పీసీఎస్ఏ)
- పీజీ డిప్లొమా ఇన్ ఫిన్‌టెక్ అండ్ బ్లాక్ చెయిన్ డెవలప్‌మెంట్(పీజీ-డీఎఫ్‌బీడీ)
- పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్స్(పీజీ-డీసీఎస్ఎఫ్)
- పీజీ డిప్లొమా ఇన్ అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్(పీజీ-డీయూఏఎస్‌పీ)

ట్రెయినింగ్ సెంటర్లు: హైదరాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, ఇండోర్, గువహటి, జైపూర్, కరాడ్, కొచ్చి, కోల్‌కతా, ముంబై, నవీ ముంబై, నాగ్‌పూర్, నాసిక్, న్యూఢిల్లీ, నోయిడా, పట్నా, పుణె, సిల్చార్, తిరువనంతపురం.



సీట్ల వివరాలు: హైదరాబాద్ సెంటర్లో మొత్తం 540 సీట్లు ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ 140, బిగ్ డేటా అనలిటిక్స్‌లో 60, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ 120, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ 40, వీఎల్ఎస్ఐ డిజైన్ 40, అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ 80 సీట్లు, అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్ 60 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులను ఫిజికల్ మోడ్‌లో నిర్వహిస్తారు.

- ఇతర సెంటర్లలోని కోర్సులు, సీట్ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

హైదరాబాద్ సెంటర్ కోర్సుల అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఐటీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/టెలి కమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఎమ్మెస్సీ/ఎంఎస్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెం ట్ కోర్సుకు ఎంసీఏ ఉత్తీర్ణులు; అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ కోర్సులకు ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంసీఏ/ఎంసీఎం/డిగ్రీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)/పీజీ (ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్) పూర్తిచేసినవారు; ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ కోర్సుకు పీజీ(మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులు; అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్‌కు ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంసీఏ/ఎంసీఎం/పీజీ డిగ్రీ(ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్) / డిగ్రీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)తోపాటు పీజీ(మేనేజ్‌మెంట్) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ కోర్సుకు మాత్రం 50 శాతం మార్కులు చాలు.

సిడాక్ కామన్ అడ్మిషన్ టెస్ట్ వివరాలు: ఇందులో ఎ, బి, సి అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌కు పరీక్ష సమయం గంట. ప్రతి సెక్షన్‌లో 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ అంగ్ల మాధ్యమంలో ఉంటాయి. 'ఎ' సెక్షన్‌లో ఇంగ్లీష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, కంప్యూటర్ ఫండమెంటల్స్-ప్రోగ్రామింగ్ అంశాల నుంచి; 'బి' సెక్షన్‌లో సీ-ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, ఆబ్జెక్ట్ ఓరియంటెడ్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, నెట్‌వర్కింగ్, బిగ్ డేటా & ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశాల నుంచి; 'సి' సెక్షన్‌లో కంప్యూటర్ ఆర్కిటెక్చర్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, మైక్రో ప్రాసెసర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సులకు అన్ని సెక్షన్‌ల పేపర్లు; మిగిలిన కోర్సులకు 'ఎ', 'బి' సెక్షన్‌ల పేపర్లు రాయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** 'ఎ' సెక్షన్ + 'బి' సెక్షన్ పేపర్లకు రూ.1550; 'ఎ' సెక్షన్ + 'బి' సెక్షన్ + 'సి' సెక్షన్ పేపర్లకు రూ.1750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** జూలై 2 నుంచి 6 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **సిడాక్ కామన్ అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** జూలై 6, 7
- **పీజీ డిప్లొమా కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.cdac.in

బాసర ఆర్‌జీయూకేటీలో ఇంటిగ్రేటెడ్ బీటెక్

నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ విద్యార్థుల కోసం 85 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు పోటీపడవచ్చు. ఇతర రాష్ట్రాల విద్యార్థుల కోసం గ్లోబల్ కేటగిరీ కింద అదనంగా అయిదు శాతం సూపర్ న్యూమరీ సీట్లు; విదేశీ విద్యార్థుల కోసం రెండు శాతం సూపర్ న్యూమరీ సీట్లు నిర్దేశించారు. పదోతరగతిలో సాధించిన మెరిట్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ), రిజర్వేషన్ నిబంధనలు, కౌన్సెలింగ్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలు సహా నాన్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం వెయిటేజీ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి రెండేళ్లు ప్రీ యూనివర్సిటీ కోర్సు ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులు ఉంటాయి. తరవాత నాలుగేళ్లపాటు బీటెక్ కోర్సు ఉంటుంది. ఇందులో కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి. మైనర్ సబ్జెక్టు కింద బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్ మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

అర్హత: తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్ఐఓఎస్/టీఓఎస్ఎస్/ఏపీఓఎస్ఎస్/సీబీ ఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. విద్యార్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 18 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను 21 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450; ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1500; గ్లోబల్ కేటగిరీలో మిగిలిన సీట్లకు పోటీ పడే విద్యార్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు
- **చివరి తేదీ:** జూన్ 22
- **వెబ్‌సైట్:** www.rgukt.ac.in

గ్రామీణ బ్యాంకుల్లో ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్స్

వివిధ రీజనల్ రూరల్ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)ల్లో కింద పేర్కొన్న గ్రూప్-ఎ-ఆఫీసర్ (స్కేల్-1, 2, 3), గ్రూప్ బి-ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది.

గ్రామీణ బ్యాంకులు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, కర్ణాటక గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, విదర్భ కొంకణ్ గ్రామీణ బ్యాంక్.

Institute of Banking Personnel Selection

- ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్): **5,585,** ఆఫీసర్ స్కేల్-1: **3499,** ఆఫీసర్ స్కేల్-2(అగ్రికల్చర్ ఆఫీసర్): **70,** ఆఫీసర్ స్కేల్-2(లా): **30,** ఆఫీసర్ స్కేల్-2(సీఏ): **60,** ఆఫీసర్ స్కేల్-2(ఐటీ): **94,** ఆఫీసర్ స్కేల్-2(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్): **496,** ఆఫీసర్ స్కేల్-2(మార్కెటింగ్ ఆఫీసర్): **11,** ఆఫీసర్ స్కేల్-2(ట్రెజరీ మేనేజర్): **21,** ఆఫీసర్ స్కేల్-3: **129**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

దరఖాస్తు రుసుము: ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; మిగతా వారందరికీ రూ.850.

పరీక్ష కేంద్రాలు: అనంతపురం, గుంటూరు/విజయవాడ, కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూన్ 27 **వెబ్‌సైట్:** www.ibps.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/e5Os0fLలో చదవండి.






టాలీవుడ్ అగ్ర నిర్మాత సి. అశ్వనీదత్ శుక్రవారం విజయవాడలో తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం ఘన విజయం అందుకున్న సందర్భంగా చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు. టాలీవుడ్ యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ శుక్రవారం తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. నిఖిల్ మామయ్య, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు నిఖిల్ నటరాజ ప్రతిమను బహూకరించారు.



హిందూపురం ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి గెలుపొందిన నందమూరి బాలకృష్ణను టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు కలసి అభినందనలు తెలిపారు. దర్శకుడు గోపీచంద్ మలినేని, బాబీ, అనిల్ రావిపూడి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ తదితరులు బాలకృష్ణను కలసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

తమ్ముడూ... నిన్ను చూసి గర్విస్తున్నా




తమిళ హీరో, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్‌హాసన్ జనసేనాని పవన్ కల్యాణ్‌ను అభినందనల్లో ముంచెత్తారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో జనసేన పార్టీ ఘన విజయాన్ని అందుకున్న సందర్భంగా 'నిన్ను చూసి గర్వపడుతున్నాను తమ్ముడూ అంటూ' పవన్‌పై ప్రశంసలు కురిపించారు. శుక్రవారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పవన్ విజయంపై స్పందించారు. పవన్ కల్యాణ్ మున్ముందు తన రాజకీయ జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఈ ప్రయాణంలో విజయం సాధించాలి, ప్రజల ఆశలు, ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చాలి అని ఆకాంక్షించారు.

మళ్లీ వస్తున్న ఉపేంద్ర 'ఏ'



కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో 'ఏ' కు ప్రత్యేక స్థానం ఉంది. 26 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఓ కల్ట్ ఫిల్మ్‌గా నిలిచింది. ఎన్నో రికార్డులు నెలకొల్పింది. త్వరలో ఈచిత్రం మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఉప్పి క్రియేషన్స్, చందు ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై 'ఏ' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత లింగం యాదవ్ తెలిపారు. ఈ చిత్రంలో చాందినీ కథానాయికగా నటించారు.

ఇకపై ట్రోల్ చేయకండి

నటుడు ఉపేంద్ర ఆగ్రహం

'నన్ను మేధావి అంటూ ఇకపై ఎవరూ ట్రోల్ చేయకండి' అని ఉపేంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి, అన్నింటా విజయం సాధించింది. దీంతో పవన్ కల్యాణ్‌తో ఉపేంద్రను పోలుస్తూ సోషల్ మీడియాలో పలువురు ట్రోల్ చేస్తున్నారు. ఉపేంద్ర 'ఉత్తమ ప్రజాకీయ పార్టీ'ని ఏర్పాటు చేసి పోటీ చేసినా ఒక్కచోటా గెలవలేకపోయారు. దీంతో ఆయనపై ట్రోల్స్ పెరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఉపేంద్ర స్పందించారు. తన గెలుపోటముల గురించి సుదీర్ఘంగా ఆలోచిస్తున్నానని, తాను గెలవాలనుకున్నప్పుడు ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరి విజయం సాధిస్తానని పేర్కొన్నారు. తన రాజకీయ పార్టీ 'ప్రజాకీయ' సిద్ధాంతాలు ప్రజలకు అర్థం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

యుద్ధానికి సిద్ధం!



ప్రభాస్ హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ట్రైలర్ ఈ నెల 10న విడుదల కానుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాలో అశ్వత్థామగా నటిస్తున్న అమితాబ్ బచ్చన్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో నెమావార్‌లోని నర్మదా ఘాట్ దగ్గర ఏర్పాటు చేసిన ఓ మ్యాసివ్ ప్రొజెక్షన్ ద్వారా అమితాబ్ పాత్రను పరిచయం చేశారు. ఇప్పటికీ అశ్వత్థామ నర్మదా మైదానంలో నడుస్తాడనే నమ్మకం ఉండడంతో నర్మాదా ఘాట్‌లో అమితాబ్ లుక్‌ను విడుదల చేయం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధభూమి మధ్యలో నిలబడి ఓ అస్త్రాన్ని పట్టుకుని యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు అమితాబ్ కనిపించారు. ఆయన నుదిటిపై ఉన్న రత్నం మెరుస్తోంది. ఆయన వెనుక ఓ భారీ వాహనం ఉంది, అలాగే ఆయన ముందు కొంతమంది వ్యక్తులు నేలపై పడి ఉన్నారు. ఈ నెల 27న విడుదల కానున్న 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొణే, దిశా పటానీ ముఖ్య పాత్రలు పోషించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/5tAR3Wo
లో చదవండి.

'కిక్కు'.. దించుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలోని నున్న పోలీసులకు సమాచారం అదించారు. వారు స్పందించకపోవడంతో సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం ప్రసాదంపాడు ప్రాంతంలో ఉన్న ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ముందు నుంచి శివకృష్ణ స్నేహితుడితో కలిసి వాహనంలో వెళుతున్నారు. అక్కడ ఆగిఉన్న ఏపీ 39 ఎన్‌క్యూ 6666 నంబరు గల కారులో కొన్ని ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర పత్రాలను ఎక్కిస్తుండటం గమనించారు. తన స్నేహితుడితో కలిసి కొంత దూరం వాహనాన్ని వెంబడించారు. ఆ తర్వాత.. ఫైళ్లు తీసుకెళ్లిన వ్యక్తి వాసుదేవ రెడ్డి అని తెలుసుకుని, నున్న పోలీసులకు తెలియజేశారు. వారు పట్టించుకోక పోవడంతో మంగళగిరి సీఐడీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు ఎఫ్ఐఆర్(17/2024) నమోదు చేశారు. ఐపీసీ 427, 397, రెడ్ విత్ 120(బి) కింద కేసు పెట్టారు. దర్యాప్తునకు ముగ్గురు సీఐల నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దించారు.

హైదరాబాద్‌లో సోదాలు...

హైదరాబాద్ నార్సింగిలోని పౌలోమీ గేటెడ్ టౌన్‌షిప్‌లో ఉంటున్న వాసుదేవరెడ్డి నివాసానికి సీఐడీ బృందం వెళ్లింది. 12 మంది సభ్యుల బృందం శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు జరిపింది. ముఖ్యమైన డాక్యుమెంట్లు, ఫైళ్లు, హార్డ్ డిస్క్‌లు స్వాధీనం చేసుకుంది. వాసుదేవ రెడ్డిని ప్రశ్నించి కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. మద్యంషాపుల్లో డిమాండ్ ఉన్న కొన్ని మద్యం కంపెనీలకు ఆర్డర్లు ఎందుకు ఆపేశారు.. పేరుకూడా వినని కొన్ని కంపెనీల మద్యాన్ని భారీ ధరలకు ఎవరి ఆదేశాల మేరకు విక్రయించారని ఆరా తీశారు.

డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి...

తెలంగాణకు చెందిన వాసుదేవ రెడ్డి రైల్వేలో ఐఆర్‌టీఎస్ అధికారి. అనంతపురం జిల్లా గుంతకల్లులో పనిచేస్తూ వైసీపీ నేతలతో సంబంధాలు పెంచుకున్నారు. జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డితో సాన్నిహిత్యం బాగా పెరిగింది. 2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి రాగానే ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆయనకు జగన్ బేవరేజెస్ కార్పొరేషన్ అప్పగించారు. ఎన్నికల సమయంలో వాసుదేవరెడ్డి వైసీపీ నేతలకు పూర్తిస్థాయిలో మద్యం అందుబాటులో ఉంచారు. డిపోల నుంచే ట్రక్కుల్లో రవాణా చేయించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. దీంతో ఆయనను ఈసీ పదవి నుంచి తప్పించింది. వాసుదేవరెడ్డి మామ మారెళ్ల పుల్లారెడ్డి. ఆయన... వైసీపీ మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు వియ్యంకుడు. ఆయన స్వగ్రామమైన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వాసుదేవ రెడ్డి అక్రమార్జనలో కొంత భాగం ఇక్కడ భూములపై పెట్టుబడి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. 2022 సెప్టెంబరులో వాసుదేవరెడ్డి భారీగా భూములు కొన్నట్లు సమాచారం. సుమారు 40 ఎకరాల భూమిని తన మామ నుంచి గిఫ్ట్ డీడ్ రూపంలో పొందారు. ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో సుమారు 25 ఎకరాల భూమిని పుల్లారెడ్డి కొనుగోలు చేశారు. సీఐడీ దీనిపైనా దృష్టి సారించే అవకాశముంది.

మద్యం స్కాం రూ.5వేల కోట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం మద్యం అమ్మకాల్లో భారీ కుంభకోణానికి పాల్పడింది. ప్రజల కోసం ప్రభుత్వ మద్యం షాపులు అని చెప్పి.. వాటి ద్వారా రూ.5వేల కోట్లు దోచేసింది. అది కాడా లిక్కర్ కంపెనీల నుంచి కాదు. కమీషన్లు ఇవ్వడం కోసం అంటూ ఆటు కంపెనీలకు రేట్లు పెంచి, ఆ పెంచిన మొత్తాన్ని ఇటు వైసీపీ నేతలు తమ ఖాతాల్లో వేసుకున్నారు. అంటే ప్రజాధనాన్ని ఆ చేత్తో కంపెనీలకు ఇచ్చి... ఈ చేత్తో జగన్ తన జేబులో వేసుకున్నారని అంచనా. అలా పోగేసిన రూ.5వేల కోట్లు హైదరాబాద్‌లో దాచిపెట్టి, తాజా ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి. మిగిలిన మొత్తం బెంగళూరుకు తరలించారని తెలుస్తోంది. బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి ఇంట్లో శుక్రవారం జరిగిన సోదాల్లో దీనిపై మరింత కీలక సమాచారం బయటపడినట్టు సమాచారం. తెలుగుదేశం ప్రభుత్వంలో మద్యం షాపులు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో ఉండేవి. ఏ బ్రాండ్లు అమ్మాలనేది అప్పట్లో వారిష్టం. జగన్ దీనిని మార్చేశారు. ప్రభుత్వ మద్యం షాపుల విధానం ప్రారంభించారు. షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలో సర్కారు పెద్దలే నిర్ణయించారు. లిక్కర్ కేసుపై రూ.250, బీరు కేసుపై రూ.150 కమీషన్‌గా ఇవ్వాలని కంపెనీలకు ప్రతిపాదించారు. అలా ఇచ్చిన కంపెనీల మద్యమే కొన్నారు. రాష్ట్రంలోని డిస్టిలరీలను అనధికారికంగా 'స్వాధీనం' చేసుకుని.. రకరకాల పేర్లతో సొంత బ్రాండ్లను ప్రవేశ పెట్టారు. వాటినే మద్యం దుకాణాల్లో విక్రయించారు. అంటే.. ఒకవైపు కమీషన్లు, మరోవైపు సొంతంగా మద్యం తయారు చేసి, బేవరేజెస్ కార్పొరేషన్‌తో కొనుగోలు చేయించి, ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించడం! ఇలా అన్ని రకాలుగా ఆదాయమే! ఈ ఐదేళ్లలో 14.38కోట్ల కేసుల లిక్కర్, 5.83కోట్ల కేసుల బీరు రాష్ట్రంలో అమ్ముడైంది. ఇందులో లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, మళ్లీ తిరిగి వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలును హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కేసుల చొప్పున కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఫార్మా కంపెనీకి రూ.300 కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి సీజ్ కావడంతో బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్ర బిందువు. తర్వాత అనేక మంది అందులోకి వచ్చారు.

ఎవరి పాత్ర ఏంటి?

ఈ తతంగం నడిపించేందుకు ఎక్సైజ్, బేవరేజెస్ కార్పొరేషన్‌లో అనేక మంది పనిచేశారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చే బాధ్యతను చివరివరకూ ఎండీగా పనిచేసిన వాసుదేవరెడ్డికి అప్పగించారు. ఆయన చెప్పిన కంపెనీలకు మాత్రమే ఆర్డర్లు వెళ్లాయి. మాకెందుకు ఇవ్వరని ప్రశ్నించిన కంపెనీలకూ కొన్నిసార్లు ఆర్డర్లు ఇచ్చారు. కానీ ఆ బ్రాండ్లను షాపుల్లో పెట్టి అమ్మకుండా, ఎవరూ కొనట్లేదని తిప్పి పంపారు. ఇక ఏ రోజు ఏ బ్రాండ్లు ఎక్కువ అమ్మాలి అనేది ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్ చూసుకున్నారు. దీనికి సంబంధించిన చార్టు 'తాడేపల్లి' పెద్దల నుంచి అందేది. కంపెనీలకు బకాయిల విడుదల అంశాన్ని రిటైర్డ్ కార్పొరేషన్ అధికారి వేణుగోపాల్ చూశారు. ప్రతి బిల్లులో 20శాతం కమీషన్ విడుదల చేశారు. 90 రోజులుగా స్టాకు అమ్ముడుపోలేదనే కారణాన్ని చూపి ఎడాపెడా గ్రౌండింగ్ చార్జీలను రిటైర్డ్ కార్పొరేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి తీసుకున్నారు. తొలుత ఎడాపెడా గ్రౌండింగ్ చార్జీలు విధించేవారు. తర్వాత వాటి అసలు లెక్కలు అంచనావేసి అందులో అసలు చార్జి పోను మిగిలింది తిరిగి కంపెనీలకు ఇచ్చేందుకు 20శాతం కమీషన్ వసూలుచేశారు. అటు కేసులపై కమీషన్లు, ఇటు కార్పొరేషన్‌లో వసూళ్లు కలిపి మొత్తంగా రూ.5వేల కోట్లకు పైగానే ప్రజాధనాన్ని దోపిడీ చేశారు. మార్కెట్ ఆధారంగా మద్యం కంపెనీలు కొత్త కొత్త పేర్లతో బ్రాండ్లు విడుదల చేస్తుంటాయి. తయారీ, సరఫరా ఇతరత్రా కారణాల దృష్ట్యా ప్రతి కంపెనీ ఎక్కువ పేర్లతో బ్రాండ్లు అమ్ముతుంది. అంటే ఒకే బ్రాండ్‌కు చివర్లో డీలక్స్, ప్రీమియం, స్ట్రాంగ్, లైట్ ఇలా వేర్వేరు పేర్లతో బ్రాండ్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటుంది. ఇలా ఏదైనా కొత్త రిజిస్ట్రేషన్ చేసుకుంటే దానికి ఎక్సైజ్ శాఖ లేబుల్ ఇవ్వాలి. దానికి కార్పొరేషన్‌లో రూ.50లక్షలు చొప్పున వసూలు చేశారు. ప్రతి ఏటా రెన్యువల్‌కు ఒక్కో లేబుల్‌కు రూ.5లక్షలు తీసుకున్నారు.

టీడీపీ ఎమ్మెల్యేలకు అభినందనల వెల్లువ

ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ ఎమ్మెల్యేలకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, అభిమానులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు అభినందనలతో ముంచెత్తుతున్నారు. కొంతమంది తమ ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



హిరమండలం: ఎమ్మెల్యే మామిడి గోవిందరావును అభినందిస్తున్న వంశధార ఎస్ఈ, ఈఈలు

హిరమండలం: పాతపట్నం ఎమ్మెల్యేగా ఎన్నికైన మామిడి గోవింద రావుకు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం ఆయన స్వగ్రామం తామరలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు, ఈఈ ఎంవీ రమణ, కొత్తూరు సీఐ వేణుగోపాలరావు, హిరమండలం ఎస్ఐ నారాయణస్వామి, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం శాసనసభ్యునిగా ఎన్నికైన మామిడి గోవిందరావును మండల తామర గ్రామంలోని తన నివాసంలో శుక్రవారం ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. స్థానిక రెల్లివీధిలో శుక్రవారం సాయంత్రం టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పైల బాబ్జీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ఎమ్మెల్యే బగ్గును కలిసిన అధికారులు

నరసన్నపేట: స్థానిక శాసన సభ్యులు బగ్గు రమణమూర్తిని నియోజక వర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వివిధ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్యవిధాన పరిషత్, గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖలకు చెందిన నాలుగు మండలాల అధికారులు కలిసి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి అభినందించారు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఈశ్వరరావు, ఎ.కామేశ్వరశర్మ, శివ, శ్రీను తదితరులు ఎమ్మెల్యేకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కేంద్రాలను పునఃప్రారంభించేందుకు కృషి చేయాలన్నారు.

అర్చకుల ఆశీర్వచనం..

జలుమూరు: నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి, సుగుణమ్మ దంపతులకు శ్రీముఖలింగేశ్వరాలయ అర్చకులు శ్రీముఖలింగేశ్వరస్వామి చిత్రపటాన్ని, జ్ఞాపికను అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలసి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, ఎస్.వెంకటాచలం, అప్పారావు, శ్రీకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవికుమార్‌కు శుభాకాంక్షలు

ఆమదాలవలస: ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్‌కు అభినందన వెల్లువ కొనసాగుతోంది. శుక్రవారం శ్రీకాకుళంలోని శాంతినగర్‌లో గల ఆయన స్వగృహం వద్ద ఆమదాలవలస నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అభిమానులు, ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు అభినందనలు తెలిపారు.



పొందూరు: రవికుమార్‌తో తోలాపి టీడీపీ నాయకులు

పొందూరు: తోలాపి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరి స్తానని ఎమ్మెల్యే కూన రవి కుమార్ హామీ ఇచ్చారు. శ్రీకాకుళంలోని రవికుమార్ స్వగృహంలో శుక్రవారం స్థానిక తెలుగుదేశం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా తోలాపి అభివృద్ధికి సహక రించాలని మాజీ ఎంపీటీసీలు పి.అప్పలనాయుడు, పొన్నాడ అప్పారావు, మాజీ సర్పంచ్ పొన్నాడ రామారావులు కోరారు.



నరసన్నపేట: బగ్గు రమణమూర్తితో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన ఉద్యోగులు

కవిటి: ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా గెలుపొందిన బి.అశోక్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం వివిధ సంఘాల నాయకులు, అభిమానులు రామయ్యపుట్టుగ చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. వరుసగా మూడోసారి ఎన్నికైనందుకు ప్రజాసంఘాలు, నియోజకవర్గానికి చెందిన వివిధ యూనియన్ల ప్రతినిధులు అభినందించారు.



అశోక్‌ను అభినందిస్తున్న ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు

జీడి పరిశ్రమల అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యే శిరీషకు ఏపీసీఎంఏ నాయకుల అభ్యర్థన

పలాస: జీడి పరిశ్రమలు సంక్షోభంలో ఉన్నాయని, వీటి అభివృద్ధికి ప్రభుత్వం తరుపున ప్రోత్సాహం అందించాలని ఆంధ్రప్రదేశ్ జీడి పప్పు తయారీదారుల సంఘం (ఏపీసీఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఫణిరాఘవులు, ఉపాధ్యక్షులు మల్లా కాంతారావు, సిహెచ్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కూసుమంచి సుబ్బరాయులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే శిరీషను శుక్రవారం ఉదయం కలుసుకొని జీడి పరిశ్రమల తరుపున వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ పలాస, టెక్కలి డివిజన్లలో మొత్తం 300కుపైగా జీడి పరిశ్రమలు ఉన్నాయని, పదివేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఈ పరిశ్రమలు గడ్డుస్థితిని ఎదుర్కొంటున్నాయని, మద్దతు ధర లేక రైతులు, సాంకేతిక సవాళ్లు, ఇతర మౌలిక సౌకర్యాలు లేక వ్యాపారులు తరచూ వ్యాపారాలు మానుకోవాల్సి వస్తోందన్నారు. కొత్త ప్రభుత్వంలో జీడి పరిశ్రమల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఎమ్మెల్యేను కలుసుకున్న వారిలో కోశాధికారి ముత్తు కుమరన్, స్థానిక వ్యాపార సంఘ నాయకులు మల్లా రామేశ్వరరావు, టంకాల రవిశంకర్‌గుప్తా, శాసనపురి మురళీకృష్ణ, తాళాసు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పలాస: శిరీషను సత్కరిస్తున్న ఏపీసీఎంఏ నాయకులు

ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు అభినందనలు

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును అధికా రులు, పోలీసు సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి అభి నందించారు. కొంత సమయం ఆయనతో ముచ్చటించారు. అధికా రుల సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా వివిధ పరిశ్రమల ప్రతినిధులు కలిశారు. కార్మికులు కలసి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.



ఎన్ఈఆర్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో ఏఎస్పీ

జలుమూరు: దక్షిణ కాశీగా ప్రసి ద్ధి చెందిన శ్రీముఖలింగంలో గల శ్రీ ముఖలింగేశ్వరస్వామిని శ్రీకాకుళం అ డిషినల్ ఎస్పీ (క్రైం) ఉమామహేశ్వర రావు శుక్రవారం కుటుంబ సమేతం గా దర్శించుకొని పూజలు చేశారు. అ ర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగ తం పలికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి శేషవస్త్రాలు అందించి దీ వించారు. అనంతరం అర్చకులు ఆల య విశిష్టతను వివరించి శిల్పకళ సౌందర్యాన్ని విశదపరిచారు. ఎస్ఐ మధుసూధనరావు, అర్చకులు నారా యణమూర్తి, వెంకటాచలం, అప్పారా వు తదితరులు పాల్గొన్నారు.



శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయ విశిష్టతను వివరిస్తున్న అర్చకులు



మిరాజ్ సినిమా షూటింగ్ దృశ్యం

శివసాగర్ తీరంలో షూటింగ్ సందడి

వజ్రపుకొత్తూరు: స్థానిక శివసాగర్ తీరంలో 'మిరాజ్' సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ షూటింగ్‌ను తిలకించేందుకు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వస్తున్నారు. చరణ్, దీపిక నాయికా నాయకులుగా నటిస్తున్న ఈ చిత్రంలో జిల్లా ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కుమార్ నాయక్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. తెలుగు, ఒడియా భాషలలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు దర్శకుడు విష్ణుదేవ్ తెలిపారు.



గోపాలపెంట వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీవో రంగయ్య

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు

నరసన్నపేట: అక్రమగా ఇసుక తవ్వకాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్‌డీవో రంగయ్య అన్నారు. శుక్రవారం గోపాలపెంట ఇసుక రీచ్‌ను రెవెన్యూ, అటవీశాఖ, సెబీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల అక్రమంగా గోపాలపెంట రీచ్ నుంచి రాత్రి సమయాల్లో ఇసుక తవ్వకాలు సాగుతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు రీచ్‌ను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లు తిరిగితే వీఆర్ఏలు... వీఆర్వోలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కనకారావు, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

భూలోకమాత ఉత్సవాలకు పందిరి రాట

టెక్కలి: ఈ నెల 14 నుంచి మేజర్ పంచాయతీ భూలోకమాత వీధిలో జరుగనున్న గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద పందిరిరాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి ముర్రాటలు చెల్లించారు. ఐదురోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

టీడీపీ నేతల సంబరాలు

జిల్లా వ్యాప్తంగా టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం వివిధ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ర్యాలీలు, ఎన్టీఆర్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేశారు.



టెక్కలి: ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణుల సంబరాలు



సంతబొమ్మాళి: ఎర్రన్నాయుడు విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న అభిమానులు



హిరమండలం: టీడీపీ నాయకుల విజయోత్సవ ర్యాలీ



సరుబుజ్జిలి: రొట్టవలసలో సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



పొందూరు: కింతలిలో కేకులు కట్ చేస్తున్న శ్రేణులు



మెళియాపుట్టిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు




ఆమదాలవలస: ఇంటింటికీ మిఠాయిలు పంపిణీ చేస్తున్న నాయకులు

కార్యకర్తలకు ఇబ్బందులు పెడితే ఊరుకోం

- మాజీ మంత్రి అప్పలరాజు

పలాస: పలాస నియోజకవర్గంలో అప్పుడే తమ కార్యకర్తలపై దాడులు జరుగు తున్నాయని, వీటిని చూస్తూ ఊరుకోబోమని, అన్ని విధాలా అండగా ఉంటామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన ప్రగతిభవన్‌లో విలేకరులతో మాట్లా డుతూ ముఖ్యమంత్రి ప్రారంభించిన కిడ్నీ పరిశోధన కేంద్రం వద్ద శిలాఫలకాలపై పేర్లు తొలగించారని, వైఎస్ఆర్ పేరు కూడా తెదెపా నాయకులు తీయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రబాబునాయుడు, పలాస ఎమ్మెల్యే శిరీషకు అభినందనలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

తలసముద్రం (పోలాకి): మానసిక ఉల్లా సానికి క్రీడలు ఎంతో దోహదపడ తాయని పోలాకి ఎస్ఐ సత్యనారా యణ తెలిపారు. శుక్రవారం తలసముద్రం గ్రామంలో భావన శ్రీనివాసరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత సర్పంచ్ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. జిల్లాస్థాయి క్రికెట్ పోటీలలో 50 టీంలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు జయవర్దన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రగడ సూరిబాబు, యువజన నాయకుడు గడ్డెయ్య, సంఘ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

టెక్కలి: టెక్కలి తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం శనివారం ఉదయం 10గంటలకు సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి విశ్రాంత ఉద్యోగులు తప్పక హాజరు కావాలని కోరారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

- చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు
- ఆకర్షించని వైసీపీ ప్రభుత్వ పథకాలు
- మూతపడిన 15 స్కూళ్లు

(సరుబుజ్జిలి)

వైసీపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు అండగా ఉంటుందని బాకాలు ఊదిన ఆ పార్టీ నాయకులకు క్షేత్రస్థాయిలో అదెక్కడా కానరాలేదు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు కూడా విద్యార్థులను ఆకర్షించలేకపోతుండడం గమనార్హం. ఇందుకు మండలంలోని మూతపడుతున్న పాఠశాలలు, తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యే నిదర్శనం.

మండలంలోని వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలు మూత దిశగా పయనిస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో వైసీపీ అధికారం చేపట్టిన నుంచి ఈ పరిస్థితి నెలకొంది. నాడు-నేడు నిధులతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఇంగ్లిష్ బోధన విద్యావిధానం, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, ఇతర విద్యా సామగ్రి ఏర్పాటు అంతా గ్రామీణ విద్యార్థులు ఆకర్షించడంలో ఏ మాత్రం సత్ఫలితాలు ఇవ్వలేదని స్పష్టత సరుబుజ్జిలి మండలంలో తేటతెల్లమైంది.

మూతపడిన పాఠశాలలు

మండలంలోని దుబ్బులపేట, చిగురువలస కాలనీ, వ్యాసులపేట, మూలపేట, చిన్న మతలబుపేట, సూర్యనారాయణపురం, చిన్న వెంకటాపురం, చిన్న షలంత్రి, సుభద్రాపురం, ఎల్‌కే పల్లి, పాలవలస, తురకపేట, తురకపేట కాలనీ, ఎల్‌పీ అగ్రహారం, అలమాజీపేట తదితర గ్రామాల్లో 15 ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సంఖ్యలో విద్యార్థులు లేకపోవడంతో విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాలలను మూసివేయించారు. సుభద్రాపురం గ్రామంలో శిథిల భవనం కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, నూతన పాఠశాల భవనం నిర్మించినప్పటికీ దానిని ప్రారంభించకపోవడంతో విద్యార్థులు ఎవరు పాఠశాలకు వెళ్లకపోడంతో ఈ పాఠశాల మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కూలడానికి సిద్ధంగా ఉన్న బురిడివలస కాలనీ పాఠశాల భవనం



పెచ్చులూడిన రావివలస పాఠశాల భవనం

గణంకాలు ఇలా..

ప్రస్తుతం మండలంలో 43 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఒకటి ఉన్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య పరిశీలించగా 2021-22 సంవత్సరానికి 3,140 మంది విద్యార్థులు ఉండగా 2022-23 సంవత్సరానికి 2,645 మంది విద్యార్థులు, 2023-24 సంవత్సరంలో 2,023 మంది విద్యార్థులు ఉండగా.. అది ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25లో 1,834 మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. జగనన్న విద్యా పథకాలు అందించినట్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతి సమావేశాల్లో ప్రకటించిన తీరుకు మండలంలో గత నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యకు ఏ మాత్రం పొంతన లేకపోడం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏ విధంగా ఉందో తేటతెల్లమవుతుంది. మండలంలో నాడు-నేడు ఫేస్-1 ద్వారా పలు పాఠశాలల అభివృద్ధి చేసిన అధికారులు, ఫేజ్-2 అంటూ కొన్ని పాఠశాలలు విస్మరించడం జరిగిందని ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజలు ఇటీవల పలు సందర్భాల్లో అధికారులను, ప్రజా ప్రతినిధులను ప్రశ్నించడం జరిగింది. ఈ ఏడాది మండలంలోని నూతనంగా ప్రారంభంకానున్న విద్యా సంవత్సరానికి బురిడివలస కాలనీ, రావివలస, అమృతలింగానగరం, ఒప్పడాం, వీరభద్రపురం గ్రామాల్లో ఉన్న శిథిల పాఠశాల భవనాలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. బురిడివలస కాలనీ, రావివలస పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ దినదినగండంగా చదువులు సాగించాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

తమ్మినేనికి చెప్పినా..

రావివలస పాఠశాల భవనం పరిస్థితిని ఇటీవల గ్రామంలో పర్యటించిన స్పీకర్‌గా ఉన్న సమయంలో తమ్మినేని సీతారాంకు వివరించడంతో పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్టు హామీ ఇచ్చినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు వేసవి సెలువులు కూడా పూర్తి కావస్తున్నా కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడడంతో మళ్లీ సర్కారు బడులకు మంచి రోజులు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అమ్మా.. నాన్న నిద్రలేవడా?

- తండ్రి మృతదేహం చూసి చిన్నారి ప్రశ్న
- కన్నీరుమున్నీరుగా విలపించిన బంధువులు
- ముగిసిన సీఆర్‌పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు



బేలగా చూస్తున్న తేజేశ్వరరావు కుమారుడు చేతన్



తేజేశ్వరరావు మృతదేహం వద్ద గాలిలో కాల్పులు జరుపుతున్న పోలీసులు

టెక్కలి: ఊరు నుంచి వచ్చీరాగానే తనను ఎత్తుకొని ఆడించే నాన్న... తను కనిపించగానే భుజాలపైకి ఎత్తుకొనే నాన్న... ఇప్పుడు ఎందుకలా నిద్రపోతున్నట్టు ఉన్నాడో... నాన్నను చూసి అందరూ ఎందుకు ఏడుస్తున్నారో అర్థంకాక అయోమయంగా చూస్తున్న ఆ చిన్నారిని చూసిన వారు కంటతడి పెట్టకుండా ఉండలేకపోయారు. 'అమ్మా...మరి నాన్న నిద్ర లేవడా?' అంటూ అమాయకంగా అడిగే ఆ పిల్లాడికి ఏం సమాధానం చెప్పాలో తెలియక తల్లడిల్లిపోయారు. ఇదీ మృతిచెందిన జవాను మెట్ట తేజేశ్వరరావు నాలుగేళ్ల కుమారుడి పరిస్థితి. సీఆర్‌పీఎఫ్‌లో జవాన్‌గా పనిచేస్తున్న తేజేశ్వరరావు మహారాష్ట్రలోని ఓ ప్రాంతంలో ఎన్నికల విధులు ముగించుకొని గురువారం యూనిట్‌కు చేరుతూ మార్గమధ్యలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో అతని మృతదేహాన్ని శుక్రవారం రాత్రి 7 గంటలకు స్వగ్రామమైన టెక్కలిలోని మండాపోలం కాలనీకి తీసుకొచ్చారు. తండ్రి మృతదేహాన్ని చూసిన నాలుగేళ్ల బాలుడు చేతన్ తల్లి చాందినికి 'నాన్న మరి లేవడా' అంటూ అడగడం అందరినీ కలచివేసింది. తేజేశ్వరరావు(32) మృతదేహాన్ని సీఆర్‌పీఎఫ్ బృందాలు ప్రత్యేక వాహనంలో టెక్కలి తీసుకువచ్చాయి. జగతిమెట్ట జంక్షన్‌కు రాగానే అప్పటికే సిద్ధంగా ఉన్న మాజీ జవాన్లు, యువకులు భారత మాతాకీ జై అంటూ త్రివర్ణ పతాకాలు చేతపట్టి... ముందుకు కదిలారు. నేరుగా వారి ఇంటికి మృతదేహాన్ని తీసుకువెళ్లగా... తండ్రి చిన్నారావు, తల్లి వనజాక్షి, భార్య చాందిని, కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శ్మశాన వాటికకు తీసుకువెళ్లిన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపారు. అనంతరం అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, చుట్టుపక్కల నుంచి పెద్దఎత్తున చేరిన యువకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రేగిడి: కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే క్రమంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం విజయనగరం జిల్లా రేగిడి మండల కాంప్లెక్స్ సమీపంలో చోటు చేసుకుంది. విద్యుత్ సిబ్బంది, స్థానికుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం పంతులపేట గ్రామానికి చెందిన బొండాది శ్రీనివాసరావు (50), లబ్బ కృష్ణతో పాటు మరో ఎనిమిది మంది ఉంగరాడమెట్ట సబ్‌స్టేషన్‌కు సంబంధించి విద్యుత్‌లైన్ పునరుద్ధరణ, కొత్త స్తంభాల ఏర్పాటు పనుల కోసం వచ్చారు. శుక్రవారం సాయంత్రం మండల కాంప్లెక్స్ సమీపంలో స్తంభాన్ని ఎత్తే సమయంలో భారీగా గాలివీచింది. దీంతో శ్రీనివాసరావు చేతిలో ఉన్న నిచ్చెన సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్‌లైన్‌కు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన శ్రీనివాసరావు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా, సమీపంలో ఉన్న రేగిడి పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. గాయపడిన కృష్ణకు చికిత్స అందించారు. శ్రీనివాసరావుకు భార్య గోవిందమ్మ, పిల్లలు హేమంత్, నవీన్ ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వీఆర్‌లో వన్‌టౌన్ ఎస్ఐ?

శ్రీకాకుళం క్రైం: నగరంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్‌ను (అటాచ్డ్ స్పెషల్ బ్రాంచ్‌కి) వీఆర్‌లోకి పంపించినట్టు పోలీసు వర్గాల సమాచారం. ఈ సందర్భంగా ఎస్పీ రాధికను శుక్రవారం ఎస్ఐ గణేష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన విధుల్లోనే ఉన్నారు.

ట్రాఫిక్ ఐలాన్‌ను ఢీ కొన్న పార్సిల్ వెహికల్



నేల కొరిగిన ట్రాఫిక్ ఐలాన్

శ్రీకాకుళం క్రైం: నగరంలో జీటీ రోడ్డు లో ట్రాఫిక్‌ను నియంత్రించే పోలీసులు ఉండేందుకు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాన్(ట్రాఫిక్ బూత్)ను గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత కొరియర్ పార్సిల్ వాహనం ఢీకొట్టింది. దీంతో ట్రాఫిక్ ఐలాన్ నేల కొరగగా, అక్కడే ఉన్న రెండు ద్విచక్రవాహనాలపై పడిపోయింది. అయితే గుద్దేసిన పార్సిల్ వెహికల్ ఎవరిదని తెలియరాకపోవడంతో ట్రాఫిక్ సీఐ అవతారం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవరుపై కేసు

జలుమూరు: ఆర్టీసీ బస్సు డ్రైవరు బాబూరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వైపు వెలుతున్న ఆర్టీసీ బస్సు తిలారు రైల్వే గేటు వేయడంతో అండర్‌పాస్ మార్గం గుండా డ్రైవరు ఆర్టీసీ బస్సును తీసుకెళ్లాడు. బస్సు అండర్‌పాస్ కిందకు వెళ్లేసరికి బస్సుపై గల లగేజీ హైట్ కంట్రోలర్ రాడ్ అండర్ పాస్‌కు తగిలి విరిగి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనదారుడిపై పడింది. ఈ ప్రమాదంలో మండలం చెన్నాయివలస గ్రామానికి చెందిన బచ్చల సింహాచలంకు కాలు విరిగింది. క్షతగాత్రున్ని 108 వాహనం ద్వారా శ్రీకాకుళం ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు ఆయన తెలిపారు. సింహాచలం ఇచ్చిన ఫిర్యాద మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తులపై దాడి

పలాస రూరల్: కిష్టుపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు గొండు మోహన్, ఆయన భార్య గొండు రేణుక, డొంకాన సురేష్‌పై అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేయడంతో గాయపడ్డారు. తమపై మారణాయుధాలతో కొందరు దాడులకు పాల్పడ్డారని బాధితులు వాపోతున్నారు. బాధితులను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పరామర్శించారు. ఇలాంటి భౌతికదాడులు సరైన పద్ధతి కాదన్నారు. పోలీసులు ఆసుపత్రికి చేరి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన పాలన అందించడమే లక్ష్యం



ఎన్టీఆర్, ఎర్రన్న విగ్రహాలకు నివాళులర్పిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఉన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నందమూరి తారక రామారావు, మాజీ కేంద్రమంత్రి, దివంగత ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మహనీయుల జీవితాలు స్ఫూర్తిగా పనిచేస్తామని, ప్రజలకు సేవ చేయడమే పరమావధిగా పనిచేస్తామన్నారు. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత అంధవరపు వరం విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, అంధవరపు ప్రసాద్, సింతు సుధాకర్, మాదారపు వెంకటేష్, కవ్వాడి సుశీల, చిట్టి నాగభూషణరావు, పీవీ రమణ, పాల్గొన్నారు.

ఆలయాలను అభివృద్ధి చేస్తాం

అరసవల్లి: దేశంలోనే ప్రసిద్ధి గాంచిన అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శాసనసభ్యునిగా విజయం సాధించిన అనంతరం తొలిసారిగా అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామివారిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆయనకు స్వాగతం పలుకగా.. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో కృష్ణమాచార్యులు జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇంద్రపుష్కరిణి, ఆలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అంబటి లక్ష్మీరాజ్యం, మండల హరికృష్ణ ప్రసాద్, పి.శ్రీనివాస్, డి.జ్యోతి ప్రసాద్, ఉంగటి వెంకటరమణ పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అభివృద్ధికి సహకరించాలి

ఎచ్చెర్ల: శ్రీకాకుళం శాసనసభ్యునిగా నూతనంగా ఎన్నికైన గొండు శంకర్‌ను రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ శుక్రవారం కలిసి అభినందించారు. ట్రిపుల్ ఐటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఎఫ్‌వో అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం



పనులు చేస్తున్న దృశ్యం

పొందూరు: గత కొన్నేళ్లుగా లోవోల్టేజ్ విద్యుత్ సమస్యతో ఇబ్బందులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ జోక్యంతో సమస్యకు పరిష్కారం లభించింది. రాపాక గ్రామం రామాలయం వీధిలో కొన్నేళ్లుగా లోవోల్టేజ్ సమస్య వేధిస్తోంది. ఈ సమస్య కారణంగా గ్రామస్తులు ఎలక్ట్రానిక్ పరికరాలైన టీడీలు, ఫ్రిజ్‌లు కాలిపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. గ్రామస్థులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. అయితే ఈ సమస్యను రవి కుమార్ దృష్టికి టీడీపీ నాయకులు తీసుకువెళ్లడంతో తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం విద్యుత్‌శాఖ సిబ్బంది పోల్‌ను, డీబీ, ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి సమస్యను పరిష్కరించారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులను తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర్, టీడీపీ నాయకులు పర్యవేక్షించారు.

సంబరాల్లో బీజేపీ శ్రేణులు

అరసవల్లి: ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీఏ పక్ష నాయకునిగా ఎన్నుకున్న సందర్భంగా శ్రీకాకుళం పార్లమెంట్ జిల్లా శాఖ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు గొప్ప విజయాన్ని అందించి ఎన్డీఏ కూటమిపై గురుతర బాధ్యత ఉంచారన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జనరంజక పాలన అందుతుందన్నారు. ఈ నెల 9న భారత ప్రధానిగా మూడోసారి మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారన్నారు కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూడి తిరుపతిరావు, అట్టాడ రవిబాబ్జీ, చల్లా వెంకటేశ్వరరావు, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంపై హర్షం

అరసవల్లి: ఎన్డీయే కూటమి రాష్ట్రంలో 164 అసెంబ్లీ స్థానాలు, 21 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించడంపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు, అనేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని వాపోయారు. ఎన్నడూ లేనంతగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గం ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పామన్నారు. జీవో నెం. 117, 84 రద్దు, మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సూర పాపారావు, అధ్యక్షుడు బమ్మిడి నరేంద్రకుమార్, కోశాధికారి వావిలపల్లి రాజారావు ప్రకటన విడుదల చేసినవారిలో ఉన్నారు.

ఏకగ్రీవంగా ఏఎఫ్‌కేకే సంఘం కార్యవర్గం



కామేశ్వరప్రసాద్



వెంకటరమణ

పొందూరు: ప్రపంచ ప్రఖ్యాత పొందూరు ఖాదీ రంగం అభివృద్ధికి కృషి చేస్తున్న ఏఎఫ్‌కేకే సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన గుంటుకు కామేశ్వర ప్రసాద్, దండా వెంకటరమణ మరోసారి ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గుంటుకు కామేశ్వర ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కొడమటి కొండలరావు, కార్యదర్శిగా మరోసారి దండా వెంకటరమణ, కోశాధికారిగా వెంకట సత్యనారాయణ, సభ్యులుగా ఎం.శ్రీనివాసరావు, డి.శ్యామసుందరరావు, వి.నరేష్, పి.బాలాజీ, కె.రమేష్, ఐ.తవిటమ్మ, సీహెచ్ ప్రమీల ఎన్నికయ్యారు. ఖాదీసంస్థ అభివృద్ధికి వడుకు, నేత కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్, కార్యదర్శి వెంకటరమణ తెలిపారు.

దుర్గమ్మకు అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విజయదుర్గ అమ్మవారిని ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం విజయదుర్గా దేవిని పూలతోను, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి



బగ్గు రమణమూర్తిని అభినందిస్తున్న దృశ్యం

పోలాకి: పోలాకి వెలుగు కార్యాలయ సిబ్బంది పనితీరు మెరుగు పడాలని, నిరుపేద మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే బగ్గరమణమూర్తి అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు అన్ని విధాలా అందుబాటులో ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేయనున్నారని.. దీనిని వినియోగించుకోవాలన్నారు. నూతనంగా ఎమ్మెల్యే బగ్గను ఘనంగా సత్కరించారు. వెలుగు సీసీలు, సీఎఫ్‌లు, వీఓఏలు ఉన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య కొట్లాట

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం మండలం భైరివానిపేటలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య శుక్రవారం రాత్రి కొట్లాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన ఏడుగురికి గాయాలు కాగా.. రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భైరివానిపేటకు చెందిన టీడీపీ సానుభూతిపరుడు సర్పంచ్ భైరి నరేష్.. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తన గ్రామంలోకి వస్తుండగా.. వైసీపీకి చెందిన సిమ్మ అప్పన్న అడ్డగించాడు. ఇటీవల వెల్లడైన ఎన్నికల ఫలితాల్లో వైసీపీ ఓటమిపాలు కావడంతో.. 'నీ అంతు తేలుస్తా'నంటూ నరేష్‌తో అప్పన్న గొడవకు దిగాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నరేష్ సోదరుడు వెంకటేష్.. ఆయన మిత్రులతో కలిసి అక్కడకు చేరుకున్నాడు. ఎన్నికలు ముగిసాయని.. ఇటువంటి గొడవలు ఇక తగదని వారించాడు. అప్పటికే అప్పన్న వర్గీయులు కూడా అక్కడకు చేరుకుని సర్పంచ్ నరేష్, ఆయన సోదరుడు వెంకటేష్‌పై దాడి చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చేసుకోవడంతో టీడీపీకి చెందిన నరేష్, వెంకటేష్ తోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే వైసీపీ వర్గానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకుని రూరల్ ఎస్ఐ వాసుదేవరావు, శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసిరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. క్షతగాత్రులను శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వాసుదేవరావు తెలిపారు.

రోడ్డుపై నీరు తొలగింపు

కంచిలి: చాలా కాలంగా రోడ్డుపై నీరు చేరి వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులను అర్జునాపురం గ్రామస్థులు శుక్రవారం పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు జేసీబీ ద్వారా సొంత ఖర్చులతో పెట్టి రోడ్డుపై చేరిన నీటిని తొలగించారు. దీంతో వాహన చోదకులు గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

జనసేనను మరింత బలోపేతం చేద్దాం

శ్రీకాకుళం అర్బన్: సమష్టిగా జనసేన పార్టీని మరింత బలోపేపేతం చేద్దామని, ఈ విజయం కార్యకర్తల్లో మరింత బాధ్యత పెంచిందని ఆ పార్టీ ప్రచార కమిటీ ఉత్తరాంధ్ర సమన్వయ కమిటీ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దానేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో పార్టీ విజయోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారానికి జనసైనికులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ నినాదంతో ముందుకు సాగి వంద శాతం పవన్ కల్యాణ్ సక్సెస్ అయ్యారని తెలిపారు. గెలిచామనే గర్వం లేకుండా ప్రజలకు సేవలందించడంలో జనసైనికులు ముందుండాలని పిలుపునిచ్చారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

ఇచ్ఛాపురం: రానున్న విద్యా సంవత్సరానికి (2024-25) గాను ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ డిగ్రీ కోర్సుల్లో జాయినింగ్ కాగోరు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాబిన్‌కుమార్ పాడి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. అడ్మిషన్లు ఈ నెల 18 నుంచి జరుగుతాయని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్, బీఏ హానర్స్ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, ఒరియా, బీఎస్సీ హానర్స్ మేథ్స్, ఫిజిక్స్, బోటనీ, కోర్సుల్లో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

పూరి పుణ్యక్షేత్రానికి కళాకారులు

ఇచ్ఛాపురం: పూరి క్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో కూచిపూడి నాట్య ప్రదర్శనకు పట్టణానికి చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు పయనమయ్యారు. ఈ నెల 9న భారత్ ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో జగన్నాథ నృత్యోత్సవం అన్నపూర్ణ రంగ మంచి ఆడిటోరియంలో జరగనున్న కార్యక్రమంలో నాట్య ప్రదర్శన ఇవ్వనున్నట్టు అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి తెలిపారు. కార్యక్రమానికి నాట్యగురువు శృతి పట్నాయక్‌తో పాటు శైలు, పూజ, శ్వేతా, దీక్షిత, రమ్యశ్రీ, నిఖిత, సింధు, పల్లవి, ప్రణవి, మౌనిక, మధుశ్రీ, జైత్రీకాద్యాయని పాల్గొంటారని తెలిపారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కవిటి: రాజపురం గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు అందించాలని ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తెలిపారు. ఈ నెల 13వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులు అందించాలన్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేయని వారు స్వయంగా వచ్చి పాఠశాలలో దరఖాస్తు అందించాలని కోరారు.

11లోగా అడ్మిషన్లు పూర్తి

రణస్థలం: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు ఈనెల 11వ తేదీలోగా పూర్తి కానున్నాయని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఈసీ, ఎంఈసీ ఇంగ్లీష్ మీడియం గ్రూపులకు సంబంధించిన సీట్లు ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా 7, 8, 9వ తరగతి సీట్లు భర్తీ కోసం ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు.

అడ్మిషన్లు పెరిగేలా చూడాలి

గార: ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు ఎక్కువగా (అడ్మిషన్లు) ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో నక్క రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు వివరించినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.

కవితల పోటీల్లో 'కుప్పిలి' ప్రతిభ



రాజారావు

ఆమదాలవలస: కెనడాకు చెందిన కవితా వేదిక సంస్థ ఈ సంవత్సరం మార్చిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో పట్టణంలోని బీఆర్ నగర్‌కు చెందిన కుప్పిలి వెంకట రాజారావు ప్రతిభ చూపారు. ఆయన రచించిన అనురాగం అస్తమిస్తున్న వేళ అనే కవితకు ప్రథమ బహుమతి లభించినట్టు సంస్థ నిర్వాహకులు నవీన్‌చంద్ర మెయిల్ ద్వారా సమాచారం పంపారు. ఈ నెలలో జరిగే జూమ్ సమావేశంలో పురస్కారం అందజేస్తారు. కేవీ రాజారావు కవితా పఠనం యూ ట్యూబ్ ద్వారా ప్రచారం కానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథలయ ఆడిటోరియంలో వేసవి వినోద విజ్ఞాన కార్యక్రమం ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కథానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు కాళీపట్నం రామారావు (కారా) తనయుడు కాళీపట్నం సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మనోవికాసం వృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ కథలు చదివి కారా మాస్టర్ పేరు నిలపాలన్నారు. శ్రీకాకుళం జిల్లాగ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా మాట్లాడుతూ.. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, సమాజంలో క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు మాట్లాడుతూ.. ఏటా నిర్వహించే ఇటువంటి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సుబ్బారావుతోపాటు రిసోర్స్ పర్సన్స్ కృష్ణారావు, మాస్టర్ శ్రీనివాసరావు, ఈశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కర రాజా, సిబ్బంది ప్రత్యూష, రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు. అలాగే బలగ శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వావిలాల జగన్నాథం నాయుడు, జనరల్ సెక్రటరీ మణిశర్మ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను, సహాయకురాలు కె.అనిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- **మందస:** మందస శాఖా గ్రంథాలయంలో గత నెల 15 నుంచి నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయని గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి తెలిపారు. పిల్లలకు వివిధ రకాల ఆటలు, నీతికథలు బోధించడం, పుస్తక పఠనంపై ఆసక్తి, విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈవో బి.నవీన్‌కుమార్, లక్ష్మీనారాయణ, కమలాకర్, ప్రకాష్, లక్ష్మమ్మ ఉన్నారు.
- **నరసన్నపేట:** ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని జీఎస్టీ అధికారి వి.రమ్య అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.ఛాయారతన్ పాల్గొన్నారు.
- **నందిగాం:** నందిగాం శాఖాగ్రంథాలయంలో గతనెల 20న ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపె అవగాహన కల్పించారు. వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. నందిగాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.హరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, పాఠకులు పాల్గొన్నారు.
- **మెళియాపుట్టి:** గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా పనిచేయాలని ఎంఈవో ఎస్.దేవేంద్రరావు అన్నారు. శుక్రవారం వేసవి శిబిరాల ముగింపు సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి అనురాధ పాల్గొన్నారు.
- **పాతపట్నం:** స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థుకు బహుమతి ప్రదానం చేశారు. శాఖాగ్రంథాలయాధికారి కాళ్ల రాజు, డాక్టర్ గిడుతూరి వేణుగోపాలరావు, పెద్దింటి ఆనందరావు, బి.జెనర్జీ, విశ్రాంత ఎంపీడీఓ సలాన చిరంజీవి, పి.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వేసవి వినోదం

గుజరాతీపేట: స్థానిక పెద్దరెల్లివీధిలో మున్సిపల్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి వినోదం కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిమ్స్ చిన్న పిల్లల వైద్య నిపుణులు బగాది రమ్య మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎటువంటి ఆహారం తీసుకోవాలన్నదానిపై అవగాహన కల్పించారు. జేవీవీ జిల్లా కోశాధికారి కుమార్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, పెన్షనర్స్ సంఘ నాయకులు డి.పార్వతీశం, అప్పారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.